విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

గురువారం 13 మార్చి 2025 8 పేజీలు

ప్రజాస్వామ్య పరిరక్షణలో పోరాటం నిత్యకృత్యం

- సీపీఐ పోరాట ఫలితమే వైన్ షాప్ మార్పునకు చర్యలు
- 10 రోజులుగా నిరసన తెలిపిన ప్రజా సంఘాలకు, కార్యకర్తలకు అభినందనలు
- ప్రజోపకరమైన అంశాలపై అధికారులు సానుకూలంగా మసలుకోవాలి
- అభినందన సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

- వార్త మెయిన్ పేజీలో

ఓటేరు చెరువును కాపాడుతాం

- ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- హెచ్చరిక బోర్డు చించేస్తే ప్రభుత్వానికి అవమానం కాదా
- పూడ్చిన మట్టిని తొలగించకుంటే ఉద్యమమే
- చెరువులో నిల్చుని పోరాడుతాం..
- కాని పక్షంలో జైలుకు వెళ్లేందుకైనా సద్ధమే
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హెచ్చరిక
- ప్రభుత్వం తక్షణమే స్పందించి చెరువు పూడికను తీసేయించాలని డిమాండ్
- ఓటేరు చెరువు ఆక్రమణను పరిశీలించిన సీపీఐ, సీపీఎం, ఆర్ పీఐ నేతలు

భూ ఆక్రమణదారుల నుంచి ఓటేరు చెరువును కాపాడి తీరుతామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తేల్చి చెప్పారు. చెరువు ఆక్రమణ తొలగించే వరకు పోరాటం చేయనున్నట్లు స్పష్టం చేశారు. బుధవారం ఓటేరు చెరువును నారాయణ పరిశీలించారు. అక్కడ చెరువు ఆక్రమణను చూసి ఆయన మండిపడ్డారు. పట్టపగలే అందరూ చూస్తుండగానే చెరువును పూడ్చేందుకు కబ్జాదారులు యత్నించిన వైనాన్ని ఆయనకు సీపీఐ, సీపీఎం, ఆర్ పీఐ నాయకులు వివరించారు. తొలతగా నీటిని నదిలోకి మల్లించి ప్రణాళిక బద్ధంగా జాతీయ రహదారిపై వున్న ఆక్రమణకు యత్నించిన వైనాన్ని అక్కడ పరిశీలించారు.

- వార్త మెయిన్ పేజీలో

చిత్తూరులో తుపాకులతో దొంగలు హల్‌చల్

- వ్యాపారి ఇంటిలోకి చొరబడన దొంగలు
- స్థానిక యువకులు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగింత

జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో తుపాకులతో ఓ వ్యాపారి ఇంట్లోకి చొరబడి దొంగల హల్ చల్ చేశారు. ఈ ఘటన బుధవారం నగరంలో నిత్యం రద్దీగా ఉండే గాంధీ రోడ్డులో చోటు చేసుకుంది. దీంతో నగరవాసులు హడలిపోయారు. ఉదయం ఆరున్నర గంటలకు సమయంలో సినీ పక్కిలో జీప్స్ వ్యాన్లో వచ్చిన దుండగులు తుపాకులతో నేరుగా వ్యాపారి ఇంటి లోకి చొరబడి దోపిడీయత్నానికి పాల్పడడం నగరంలో కలకలం రేకెత్తించింది. భారీగా జనసంచారం ఉన్న ఈ ప్రాంతంలో దుండగులు తుపాకులు కత్తులతో ఇంట్లోకి జొరబడి హంగామా సృష్టించారు.

- వార్త మెయిన్ పేజీలో

కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది

- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథ్ రెడ్డి

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : రాజ్యాంగం ప్రకారం దళితుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వానికి ప్రజాగ్రహాన్ని గురౌవుతుందని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి దుయ్యపట్టారు. మండలంలోని తహశిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ మండల పార్టీ కార్యదర్శి కత్తి ధర్మయ్య అధ్యక్షతన, సత్తి వేడు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి అంబాకం చిన్ని రాజ్ ఆధ్వర్యంలో కనమనంబేడు గ్రామ దళితులు ఇంటి స్థలాల వివాదంపై నిరాహార దీక్షకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కనమనం బేడు గ్రామం చెందిన దళితులు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న సర్వే లెక్క దాఖలలో 252,253,254, నెంబర్లలో సుమారు 1-75 సెంట్లు భూమి ఇంటి పట్టాలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా పోరాటాలు చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. పెత్తందారులు కార్యాలయాల ప్రాంగణం పరిధిలో ఉన్న భూమిని ఆక్రమించుకుని కంచి వేస్తే వారి మర్యాదుల్తో కార్యాలయంలోకి ఆహ్వానం పలకడం ఏమిటని ప్రశ్నించారు. స్థానికేతరులు అయితే సంచులతో వస్తారని... స్థానికలైతే

2

పేద విద్యార్థులను కూటమి ప్రభుత్వం దగా చేసింది

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- వార్త 8 పేజీలో

కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి) ఒట్టి చేతులతో వస్తారని వారిపై నిర్లక్ష్యం చూపడం అధికారుల లక్షణం కాదన్నారు. స్థానికేతుడైన డాక్టర్ బత్తయ్య నాయుడు భూకబ్జాలకు పాల్పడుతుంటే రెవెన్యూ అధికారులు నిమ్మక నేరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు. దళితులను చట్టాల పేరుతో భయభ్రాంతులకు గురిచేసి వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయడంలో అబద్దాలు చెప్పి కేసులు పేరుతో వారిని అణిచివేయడం మంచి పద్ధతి కాదన్నారు. ధనికులైతే రాచమర్యాదలు, దళితులైతే లాటి దెబ్బలా అని విమర్శిం చారు.ఈ మండలంలో రెవెన్యూ అధికారులు తలారి నుంచి తహసిల్దార్ వరకు అవినీతికి పాల్పడినవారే, గ్రామంలోని దళితులు ఉమ్మడి కుటుంబంతో ఇరుకు కాపురం చేస్తుంటే కూటమి ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయాల్సిన అధికారులు ఎందుకు వారిపై దళితులపై దౌర్జన్యాలు దిగుతున్నారని విమర్శించారు.ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం విస్మరించిం దన్నారు. నాడు వైఎస్ పాలనలో, నేడు చంద్రబాబునాయుడు పాలనలో ఇళ్ల సమస్య పరిష్కారం కాలేదని ఎద్దేవా చేసారు,కార్పొరేట్లకు కాదు.. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కావాలని కోరారు. పేదలు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భూ పోరాట కమిటీ సభ్యులు చింతపూడి రమణయ్య, కొప్పుల షణ్ముగం, ఉచ్చూరు సుబ్రమణ్యం, కె జనార్ధన్, ఉచ్చూరు గురవమ్మ , చింతపూడి వీరస్వామి, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బిపిఎస్, ఎల్ఆర్ఎస్ మేళాను సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 20 వరకు నిర్వహించనున్న బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్. మేళాను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బి.పి.ఎస్.) -2019, లే అవుట్ రేగులరైజేషన్ స్కీమ్ (ఎల్.ఆర్.ఎస్.)-2020 లో పెండింగ్ లో వున్న దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి, టి.డి.ఆర్. లపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు. మార్చి 13 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాల యంలో ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. సెలవు రోజుల్లో ఉండదని, ఎల్.టి.పిలు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - చిత్తూరు : రామకుప్పం మండల పరిధిలోని ఏడు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నలంద విద్యాసంస్థ యాజమాన్యం ఆధ్వర్యంలో పరీక్షలకు సంబంధించిన విద్యాసామాగ్రిని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే డాక్యుమెంట్స్ ఫైల్స్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ తదితరాలను బహూకరించడంతో చదువుపై విధ్యార్థుల్లో మరింత శ్రద్ధ పెరుగుతుందని పేర్కొన్నారు అదే విధంగా మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు కార్యక్రమంలో నలంద విద్యాసంస్థ కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు వినయ్ రెడ్డి, హరిప్రసాద్ శివకుమార్, హరికృష్ణ, మమత ,నందిని తదితరులు పాల్గొన్నారు

విద్యా వ్యవస్థ ను భ్రష్టు పట్టించింది వైసీపీ ప్రభుత్వమే

- సీఎం పిఏ మనోహర్

విశాలాంధ్ర - చిత్తూరు : రాష్ట్రంలో విద్యావ్యవస్థ వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు గతంలో టిడిపి ప్రభుత్వం క్రమం తప్పకుండా సకాలంలో విద్యార్థులకు ఫీజ్ రీ ఎంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ ను అందించడం జరిగిందని తెలిపారు వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటి పేర్లను మార్చి విద్యా దీవెనగా కాలేజీలకు నేరుగా ఫీజ్ రీ ఎంబర్స్ మెంట్ అందించకుండా, తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసి విద్యార్థులను, తల్లి దండ్రులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు అంతే కాకుండా విద్యార్థులకు ఫీజ్ రీ ఎంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు చెల్లించకుండా వేధించిందన్నరు సీఎం చంద్రబాబు నేతృత్వంలో మంత్రి నారా లోకేష్ ఆ బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారని అదేవిధంగా 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజ్ రీ ఎంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లకు నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు.

గృహ నిర్మాణ ఎస్సీ,ఎస్టీ,బీసీలకు అదనంగా ఆర్థిక సాయం

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి : చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా సాయం చేయడానికి ముందుకు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలో కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల లబ్ధిదారుల గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడానికి అదనంగా ఆర్థిక సాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఎస్సీ బీసీ లబ్ధిదారులకు 50,000 ఎస్టీ లబ్ధిదారులకు 75 వేల నుండి లక్ష రూపాయలు వరకు అందించడం జరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ఇది వర్తిస్తుందని, ఇందుకుగాను 1.20 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో డీకేటి పట్టాలు వెబ్ ల్యాండ్ సక్రమంగా నిర్వహించకోవడం వంటి కారణాలతోనే రెవెన్యూ సమస్యలు అధికంగా ఉత్పన్నమవుతున్నాయని, దీనిపై క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని తాసిల్దారులను ఆదేశించినట్లు చెప్పారు.ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లకు 9 కోట్లు 2100 గోకులం షెడ్లు నిర్మాణానికి 48 కోట్లు మంజూరు చేసామన్నారు. రానున్న రోజుల్లో సీసీ రోడ్లు లేఔట్ కాలనీలో రోడ్డు నిర్మాణం తదితర మౌలిక వసతులు కోసం 120 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఎంపీ నిధులుద్వారా 90 అభివృద్ధి పనులు చేపట్టి 70 పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రజలకు అనుకున్న వైద్య సేవలపై టాటా సంస్థ ద్వారా కుప్పంలో ప్రత్యేకంగా ఒక పైలట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే కుప్పంలోని ఈ ప్రాజెక్టు ప్రారంభమవుతున్నారు. పారిశ్రామిక వాడల అభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఇందులో భాగంగా స్థల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడ నీటి సమస్యలు లేకుండా ప్రత్యేకతలు చేపట్టామన్నారు. జిల్లాలో 8 కోట్ల జడ్పీ నిధులతో పైప్లైన్ నిర్మాణం విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో నీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించామన్నారు. పి 4 కార్యక్రమంలో భాగంగా పూతలపట్టు కుప్పం నియోజవర్గంలో కొన్ని ప్రాంతాలను ఎంపీక చేయాలని నిర్ణయించామన్నారు. అలాగే కుప్పంలో అంగనవాడి కేంద్రాలను ప్రజలకు అనుసంధానం చేసే విధంగా ప్రత్యేక ప్రాజెక్టు త్వరలోనే శ్రీకారం చుట్టం ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు .

తెప్పపై శ్రీ మలయప్పస్వామి అభయం



విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో నాలుగో రోజు బుధవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు.ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది.ఈ కార్యక్రమంలో తిరుమల చినజీయర్ స్వామి, ఏపీ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ ఆర్కే మీనా, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామ కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ఆరణి

విశాలాంధ్ర - తిరుపతి: పెరుగుతున్న జనాభా దృష్ట్యా తిరుపతిలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని బుధవారం అసెంబ్లీ లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. టిటిడి ఆధ్వర్యంలో ఉన్న కాలేజీలు మినహా ప్రభుత్వానికి సంబంధించి కాలేజీలు లేవని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కాగా శెట్టిపల్లి భూమలకు సంబంధించి ముప్పయ్ ఏళ్ళుగా సమస్య పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఆ గ్రామాన్ని సందర్శించి పరిష్కరిస్తామని చెప్పారని ఆయన గుర్తు చేశారు. ఐతే గత ఐదేళ్ల దుర్మార్గపు పాలనలో శెట్టిపల్లి వాసుల సమస్యను పరిష్కరించకపోగా మున్సిపాలిటీలో కలిపేశారని ఆయన చెప్పారు. మున్సిపాలిటీ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్ట లేదని ఆయన చెప్పారు. 2019లో శెట్టిపల్లిని తుడా పరిధిలో కలిపారని తిరిగి మున్సిపాలిటీ నుంచి తప్పించి తుడా పరిధిలో వెంటనే చేర్చేలా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే 30ఏళ్ళ కిందట వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం వేశారని ఆయన తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ పాతది కావడంతో నిత్యం డ్రైనేజీ ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారని కావున కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు

29,041 మంది విద్యార్థులు హాజరు: ఆర్.ఐ. ఓ

విశాలాంధ్ర- తిరుపతి : జిల్లాలో నేడు జరుగుతున్న ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయని, ఈ రోజు జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 29,041 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్.ఐ. ఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 జనరల్, 14 ఒకేషనల్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫిజిక్స్ పేపర్ -, ఎకనామిక్స్ పేపర్ - మరియు ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు జనరల్ 28,599 మంది, ఒకేషనల్లో 1,040 మంది మొత్తం 29,639 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 566 , ఒకేషనల్లో 32 మంది, మొత్తం 598 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో త్రాగు నీటి వసతి, పోలీసు బందోబస్తు, మెడికల్ క్యాంపు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పర్యవేక్షణ, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా బస్సుల సౌకర్యం కల్పించామని ఆర్.ఐ. ఓ ఆ ప్రకటనలో తెలిపారు.

హామీలన్నీ నెరవేర్చాల్సిందే

ఇచ్చిన హామీలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన డిమాండ్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : ఫీజు రీయంబర్స్ మెంట్, నిరుద్యోగ బృతిని వెంటనే విడుదల చేయాలని, మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన యువత పోరు విజయవంతమైంది. యువత పోరుకు విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులతో పాటు పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున తరలివ చ్చారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై నిరసనలతో హెూరెత్తించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వందల సంఖ్యలో పోలీసులు వలయంగా చుట్టుముట్టగా పోలీసు వలయాన్ని దాటుకుని విద్యార్థులు గేటు వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో తమకు పరీక్షలు రాయడానికి అవకాశం లేకుండా కాలేజీల యాజమాన్యం హాల్ టిక్కెట్టులు ఇవ్వడం లేదని బాధిత విద్యా ర్థులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ అధ్యక్షులు డాక్టర్ శిరీషా, తిరుపతి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మేకతోటి రాజేష్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, యువత, విద్యార్థి సంఘం నేతలు, బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు తరలివచ్చారు. బుధవారం ఉదయం 8గంటల నుంచే పోలీసులు ఆ పరిసర ప్రాంతాలను చుట్టుముట్టి ఎక్కడికక్కడ నిర్బంధం చేసినప్పటికీ ఊహించని స్థాయిలో పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసం, నిరుద్యోగ యువతను చంద్రబాబు సర్కారు చేసి నయవంచనను ఎండగట్టారు. జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో పోరాటాలతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు.

ఘనంగా వైయస్సార్సీపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లో బుధవారం వైఎస్ఆర్సిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మున్సిపల్ చైర్ పర్సన్ దబ్బల శ్రీమంత రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట వైఎస్ఆర్సిపి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీమంత్ రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం స్థాపించిన పార్టీ వైఎస్ఆర్సిపి పార్టీ అని తెలిపారు. ఈ పార్టీ స్థాపించి 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15 సంవత్సరాల అడుగుపెడుతున్న సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అలాగే డివైస్ కాలనీ ఎదురుగా ఉన్న వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం నందు వైఎస్ ఆర్సిపి పార్టీ నాయకులు కృపాకర్ రెడ్డి చేతుల మీదుగా వైయస్సార్సీపి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి, గోగుల తిరుపాలు, తడ ఎం.పీ.పీ. రఘు, కలత్తూరు సునీల్ రెడ్డి, శరత్ గౌడ, బండి రాజేష్, కొండూరు జనార్ధన, మిజూరు రామకృష్ణారెడ్డి, చిన్ని సత్యనారాయణ,వైయస్సార్సీపిపార్టీ కార్యకర్తలు ,నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర -గూడూరు : పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారని రాష్ట్ర ప్రజలందరూ ఆయనకు అండగా ఉండాలని గూడూరు వైసిపి నాయకులు సుభాన్ వెల్లడించారు .గూడూరు పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి వైసిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు సుభాన్ మాట్లాడుతూ వైయస్సార్ తనయుడు జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమ ధ్యేయంగా 15 సంవత్సరాల క్రిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారని తెలిపారు. టిడిపి పార్టీని గెలిపించి మోసపోయామని ఈరోజు ప్రజలందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ,పాల్గొన్నారు

వైసీపీ యువత పోరుకు తరలిన పుంగనూరు నేతలు

విశాలాంధ్ర – పుంగనూరు: వైయస్సార్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు జిల్లా పార్టీ ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్ వద్ద బుధవారం రోజున నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి పుంగనూరు నుండి వైసీపీ ముఖ్య నేతలంతా తరలి వెళ్లడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్న విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం జరిగిందన్నారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు తల్లికి వందనము గాని విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలు గానీ యూనిఫాం గానీ ఏవీ ఇవ్వలేదన్నారు వేద విద్యార్థులకు ప్రభుత్వ సహాయం అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతూ అనేకమంది ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందన్నారు. కళాశాల యాజమాన్యాలకు కాలేజీ పేజీలు మిస్ ఫీజులు చెల్లించలేక ఎంతో మంది విద్యార్థులు చదువుకోవడం మానేయడం జరిగిందన్నారు ఈ యువత కోరుతూనైనా ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థులకు వలసిన అన్ని సంక్షేమ కార్యక్రమాలను అందివాలని కోరుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి నాగరాజు రెడ్డి నరసింహులు ప్రభాకర్ నాయక్ వైసీపీ నాయకులు రమణ,కంచికుమార్,రామకృష్ణారెడ్డి,సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పుత్తూరు సిద్ధార్థలో ఘనంగా జూబ్లీహిల్స్ వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర – పుత్తూరు: పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యాసంస్థలో జూబ్లీహిల్స్ 2కె 25 వేడుకలు ఘనంగా ప్రారంభించినారు ఈ వేడుకలను కళాశాల చైర్మన్ డాక్టర్ కొండూరు అశోక్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థన గీతాలతో ప్రారంభించినారు మొదటిరోజు బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాల ఆడిటోరియంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫేర్ వేల్ వీడ్కోలు వేడుకలను ప్రీ ఫైనలియర్ విద్యార్థులు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు అశోక్ రాజు ఘనంగా సాల్వాతో సన్మానించి మెమొంటో బహుకరించారు సీనియర్ విద్యార్థులు కళాశాలలతో వారికున్న అనుబంధాన్ని అధ్యాపకులతో గడిపిన తీపి విషయాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు నాలుగు సంవత్సరాలు పాటు సిద్ధార్థలు తమ బిటెక్ కెరీర్ ను పూర్తిచేసుకుని వివిధ రంగంలో సిరప్ పడబోతున్నారుని వారికి శుభాభినందనలు తెలిపారు. ఏ రంగంలో కెళ్లినా కుటుం బాన్ని గౌరవించాలని కుటుంబం కోసం సమయాన్ని కేటాయించాలని మంచి జీవనం శైలిన్ని అల మార్చుకోవాలని తెలిపారు. సాయంత్రం ఓపెన్ ఆడిటర్‌లో జరిగిన స్పోర్ట్స్ డే వేడుకలను వైభవంగా జరిపారు క్రికెట్ షటిల్ వాలీబాల్ త్రో బాల్ టెన్నికాయిట్ రిలే మొదలగు పోటీలు నిర్వహించి వాటిలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు అధ్యాపకులకు అధ్యాపకేతర సిబ్బందికి మొదటి, ద్వితీయ బహుమతులు అందజేశారు. గెలుపు పొందిన వారందరికీ సర్టిఫికెట్ మెడల్స్ షీల్డ్‌లుకు చైర్మన్ అశోకరాజుతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి జనార్దన్ రాజు అందజేస్తారు విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక కార్యక్రమంలో శ్రోతలను అలంకరించారు. రెండవ రోజు గురువారం జూబ్లీ హిల్స్ వేడుకలు సాయంత్రం నాలుగు గంటలకు కన్నుల పండుగగా నిర్వహిస్తా మని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ కాల్ యూని వర్సిటీ అనంతపురం వై ఛాన్సలర్ పర్సన్ ప్రో ఫెసర్ సుదర్శన్ రావు ఇచ్చేస్తారని అలాగే విద్యార్థులను ఆలదింప చేయడానికి ప్రముఖ సినీ హీరోయిన్ సంయుక్త మేనక యాంకర్ ఖాను శ్రీ విచ్చేస్తారుని తెలిపారు. ఓపెన్ లో జరిగిన స్పోర్ట్స్ డే వేడుకల్లో కళాశాల చార్మినా అశోక రాజు ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి జనార్దన్ రాజు హెచ్ వడిలో అధ్యాపకులు అధ్యాపక తక సిబ్బంది విద్యార్థి విద్యార్థులు తదితర పాల్గొంటారు

మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర – పుత్తూరు: మాదకద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనమని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య మాట్లాడుతూ యువతరాన్ని చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైందని, తల్లిదండ్రులు విద్యార్థులు తగు జాగ్రత్తతో ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాలలో ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేశామని అన్నారు. గంజాయి, డ్రగ్స్ మొదలైన మాదకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించే ఉద్దేశంతో ఈగల్ క్లబ్'అనే విభాగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అందులో భాగంగా కళాశాలలో కూడా ఈగల్ క్లబ్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జె.కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ వి. వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కే. శ్రీనివాస్, న్యాయ నిపుణులు మురగారెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విందూరు హైస్కూల్లో సరస్వతి పూజోత్సవం

విశాలాంధ్ర – గూడూరు : గూడూరు మండల పరిధి లోని విందూరు జడ్పీ ఉన్నత పాఠశాల నందు బుధవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలను తోరణాలతో అలంకరించి సంప్రదాయ బద్ధంగా సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డివిఎన్ మల్లిఖార్జునరావు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ శ్రీనువాసులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సొన్నేపల్లిలో తీరిన నీటికష్టం

హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

విశాలాంధ్ర - పెద్దపంజాణి : పెద్ద పంజాణి మండలం రాజు పల్లి పంచాయతీ పరిధిలోని సొన్నేపల్లి గ్రామంలో ఎట్టకేలకు నీటి కష్టం తీరింది. గతంలో ఉన్న బోరులో నీరు అడుగంటుతుండడంతో ఈ వేసవిలో నీటి సమస్య తలెత్తుతుందని గ్రామస్తులు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో బోరు డ్రిల్ చేసి మోటారు పైపులను అమర్చకుండా విస్మరించారు. దీంతో తమ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని కొద్ది రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని గ్రామస్తులు కలసి సమస్యను ఆయనకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన నీటి సమస్య పరిష్కారానికి రూ. 3 లక్షల జెడ్పి నిధులను మంజూరు చేయించారు. దీంతో మోటర్ మరియు పైప్ లైన్లను అధికారులు బుధవారం అమర్చగా నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేసవిలో తమ గ్రామానికి ఇక నీటి కష్టాలు తప్పినట్టేనని ఎమ్మెల్యేకు సమస్యను చెప్పిన వెంటనే పరిష్కరించినందుకు ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో గౌతమ్ రెడ్డి, పంచాయతీ అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి, బూత్ కన్వీనర్ చందు, బద్రి, జయపాల్ రెడ్డి, నాగరాజ, శ్రీనివాసులు, జగదీష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - సత్యవేడు: సత్యవేడులో వైయస్సార్సీపి 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ నేతలు పలువురు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం సత్యవేడు పట్టణం వైయస్సార్ విగ్రహం వద్ద మండల వైఎస్ఆర్సివి కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి,బెల్ట్ రమేష్,మస్తానమ్మ,సోమశేఖర్ శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపిటిసి మోహన్ రెడ్డి,సర్పంచ్ రవి రెడ్డి,శ్రీధర్ రెడ్డి తదితరులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు లక్ష్యంగా ఆవిర్భవించినదే వైయస్సార్ పార్టీ అన్నారు. ఈ ఆశయ సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు. పార్టీ ఆవిర్భవించి 15 సంవత్సరాలు పూర్తయిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమ కోసమే పని చేస్తున్నామన్నారు. అంతకు మునుపు పార్టీ నేతలు డాక్టర్ వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణుల మధ్య కేకును కట్ చేసి పుర ప్రజలకు పంపిణీ చేశారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని వైసీపీ కార్యాలయ ఆవరణలో ఈ వేడుకలు చేశారు. ఇందులో భాగంగా వైసీపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ విధానాలను అంజూరు శ్రీనివాసులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు వయ్యాల సుధాకర్ రెడ్డి, కంఠా ఉదయ్ కుమార్, బాలిశెట్టి చంద్ర శేఖర్, శ్రీవారి సురేష్, సాధన మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, డాక్టర్ శంకర్, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, కొల్లూరు హరినాథ్ నాయుడు, ఫరూన్ ఫరీద్, ఫాజిల్, చింతామణి యానాదయ్య, పసల సుమతి, షర్మిల ఠాగూర్, పసల సురేష్, రఘు, రంగయ్య, ఆరిఫ్, రవి, గుణ, శంకరయ్య, బాబు, చెంచయ్య నాయుడు, వరప్రసాద్ నాయుడు, సుందర రామిరెడ్డి, వెంకటేష్, సుధాకర్, అంకయ్య, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు రెండో పట్టణ పరిధిలోని బెల్దారి కాలనీ వద్ద యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ కథనం మేరకు బీహార్ కి చెందిన మొహమ్మద్ ఇస్మాయిల్ (35) బెల్దారు పనులు చేసుకుంటూ గూడూరు రెండో పట్టణంలోని బెల్దారి కాలనీలో నివసిస్తున్నార న్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నారు అన్నారు. వ్యక్తి గత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని విచారణలో తెలిసిందన్నా రు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం14 పూర్తి చేసుకుని 15 వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని మండల పార్టీ కన్వీనర్ మణి నాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బస్టాండ్ ప్రాంగణం ఎదుట వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల పార్టీ అధ్యక్షుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్పార్టీ పేదల గుండెల్లో సుస్థిర స్థానం సాధించిందన్నారు, జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో బరువు బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషిచేశారని కొనియాడారు, గ్రామీణ ప్రాంతాలలో ఆయన పార్టీ అభివృద్ధి కొరకు ఎదురుచూస్తున్నార న్నారు. వైసీపీ పార్టీ. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఎగురవేసి దివంగత రాజశేఖర్ రెడ్డి విగ్రహాలను పూల మాలలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బూదూ రు వెంకటమ్మ, గోపాల్ రెడ్డి, రవి రెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముని కృష్ణారెడ్డి, దేవదాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య, కత్తి సురేష్, అమరలింగయ్య, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోల సమావేశం

విశాలాంధ్ర - కార్వేటినగరం :స్థానిక లక్ష్మీనరసింహ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు ఎ దిలీప్ కుమార్, ఎస్ వెంకటేశ్వర్లు, జి.ధనంజయ రెడ్డి, ఎ పురుషోత్తం మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించా లని, తల్లిదండ్రులకు, పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తేవాలన్నారు . పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆర్ మహేశ్వర రాజు, ఉపాధ్యా యులు,పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఓంకారం, జ్వాల ప్రజ్వలన చేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఎన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కిషోర్, ఎ ఓ ఆర్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

457 నేత్రదాతగా బీరక ప్రణీత్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో భాగంగా, సూళ్లూరుపేట, సాయినగర్ వాస్తవ్యులు కీ.శే. బీరక ప్రణీత్ (21 సం) గారి మరణానంతరం వారి కార్నియాలను, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో సేకరించి చెన్నై శంకరనేత్రాలయ వారికి అందజేయడం జరిగింది. వీరు మరణించినా నేత్రదానం ద్వారా ఇద్దరు శరీరాలలో జీవించే ఉంటారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో వీరు 457వ నేత్రదాత గా నిలిచారు అని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు ఎం. ఎం .చంద్రబాబు తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర - పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపో నందు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీన 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించబడునని డిపో మేనేజర్ సుధాకర్ అయ్య పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఈ కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు సలహాలు ఆర్టీసీ అభివృద్ధికి సూచనలు చేయగలరని ఆయన తెలిపారు ఫోన్ చేయాల్సినవారు 9100 941850 కు చేయగలరని ఆయన కోరారు.

మండలంలో ఘనంగా వైసీపీ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర- ఓజిలి: ఏ పార్టీ మమ్ములను ఏమీ చేయలేవని వైసీపీ నాయకులు దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి తెలియజేశారు. బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ఓజిలి ఆర్టిసి బస్టాండ్ ఆవరణములో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, ఎంపీపీ అరుణా రెడ్డి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు దేశి రెడ్డి మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ ఏ పార్టీ మమ్ములను ఏమి చేయలేవని ఆయన తెలియజేశారు, మళ్లీ అధికారంలోనికి రాబోయేది వైసిపి పార్టీ అని జగన్మోహన్ రెడ్డి రెండవసారి ముఖ్య మంత్రి అవుతారని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలు ఎవరికి భయపడాల్సిన పనిలేదని పార్టీ గెలుపు కోసం కార్యకర్తలందరూ అలసికట్టుగా పనిచేయాలన్నారు. అదే విధంగా మండల వైసీపీ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు పేద, బడుగు ,బలహీన వర్గాల ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. 15వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచ్చూరు హరినాద్ రెడ్డి, ప్రవీణ, మధుసూదన్ రెడ్డి, లెక్కల ప్రసాద్ నాయుడు, కొండూరు దామోదర్ రాజు, బట్టా అనిల్ యాదవ్, వృద్ధి యాదవ్, ఎస్. కె ఖాదర్బాషా, రామ్మూర్తి రాజు, సుబ్బరాయుడు, తిరుపాలయ్య పలువురు పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కళాశాల బాలుర వసతి గృహ అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణం బీసీ కాలనీలో ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహ ప్రాంగణంలో మూడు అదనపు గదుల నిర్మాణానికి ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ హజ్మీ కహోకాసేన్ భూమి పూజ చేశారు.బుధవారం జిల్లా బీసీ సాంఘిక సంక్షేమ అధికారిని జోష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ ఎండి హజ్మీకహోకాసేన్ చేతుల మీదుగా అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భూమిపూజ జరిపారు.ప్రస్తుతం బీసీ కళాశాల విద్యార్థులు నివాసముంటున్న హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దీని బాగు కోసం సాంఘిక సంక్షేమ అధికారులు ప్రయత్నాలు చేశారు.అయితే భవనం మరమ్మత్తు చేసిన ప్రయోజనం ఉండదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు.దీంతో కొత్తగా అదనపు గదుల నిర్మాణానికి సంబంధించి శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి అభ్యర్థన మేరకు ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ యాజమాన్యం ముందుకు వచ్చింది.దాదాపు 52 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో మూడు అదనపు గదులు నిర్మించడానికి కంపెనీ యాజమాన్యం అంగీకరించింది.ఈ నేపథ్యంలోనే అదనపు గదుల నిర్మాణానికి ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ ఎండి భూమి పూజ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎండి హజ్మీకహోకాసేన్ మాట్లాడుతూ 7 నెలల్లో అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవి, బిసి సహాయక సాంఘిక సంక్షేమ అధికారి కృష్ణయ్య, స్థానిక హాస్టల్ వార్డెన్ గంగాధరం,బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ జైకుమారి,బుచ్చినాయుడు కండ్రిగ బిసి బాలుర వసతిగృహం వార్డెన్ రామయ్య,ఎన్ఎస్ కంపెనీ సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమని తెలుగు మహిళా నేతలు చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో బుధవారం వారు పాత్రికేయులతో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావరం నుంచి మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పురుషులతో పాటు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకే దక్కిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి... వారి జీవన స్థితిగతులను మార్చారన్నారు. మహిళల పేరుమీద ఇళ్లపట్టాలు, ఇంటి నిర్మాణం, భూమి కొనుగోలు వంటి పథకాలు ఎన్నో ఆచరణాత్మకంగా అమలు చేసి చూపించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ 2025 -26 బడ్జెట్ లో మహిళా శిశు సంక్షేమానికి రూ.4,332 కోట్లు కేటాయించిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ ప్రత్యేకించి మహిళల బడ్జెట్ అని చెప్పుకోవచ్చన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు తీరని అన్యాయం చేశారని వారు ఆరోపించారు. ఉచితంగా ఇళ్లు ఇస్తానని నమ్మించి... ఓటీఎస్ పేరుతో ఒక్కో మహిళ నుంచి రూ.10 వేల నుంచి రూ.30వేలు బలవంతంగా వసూలు చేశారన్నారు. జగన్ పెళ్లి కానుకలు ఇవ్వడానికి కఠిన నిబంధనలు పెట్టి... పేదింటి ఆడపిల్లలకు తీరని నష్టం చేశారన్నారు. అంగన్వాడీల జీతాలు చంద్రన్న రూ.6,300 పెంచితే... జగన్ పెంచింది కేవలం రూ.1000 మాత్రమే అన్నారు. జాతీయ స్థాయిలో మహిళలపై నేరాల రేటు 66.4శాతం కాగా... ఏపీలో జగన్ పాలనలో 96.2శాతం నమోదు కావడం ఆయన డొల్లతనాన్ని తెలియజేస్తోందన్నారు. వైసీపీ పాలనలో 30,196 మంది మహిళలు, చిన్నారులు అదృశ్యమయ్యారన్నారు. చంద్రన్న పాలనలో సున్నా వడ్డీని రూ.5 లక్షల వరకు చేస్తే... రూ.10 లక్షలకు పెంచుతానని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రూ.3 లక్షలకు కుదించాడన్నారు. ఆ రూ.3 లక్షలకు వడ్డీ కూడా కేంద్రమే భరించింది తప్ప.. జగన్ రెడ్డి ఇచ్చింది సున్నా అని వారు విమర్శించారు. రూ.10 వేల కోట్లు పొదుపు సొమ్ము... రూ.2100 కోట్ల అభయహస్తం నిధులు దోచేసిన జగన్ రెడ్డి డ్వాక్రా వ్యవస్థ గురించి మాట్లాడే కనీస అర్హత ఉందా.... అని తెలుగు మహిళలు ప్రశ్నించారు. అమ్మఒడికి రూ.13వేలు ఇచ్చి నాన్న బుడ్డిలో రూ.70వేలు గుంజుకున్నాడన్నారు. మహిళల పారిశ్రామిక రాయితీలు ఎగ్గొట్టారని వారు ఆరోపించారు. బాలికల చదువుల్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో తెచ్చిన సైకిళ్ల పంపిణీ రద్దు చేశారన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించిన ప్రతి మహిళనూ సురక్షితంగా ఇంటికి చేర్చే తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ని దూరం చేసాడన్నారు. గిరిజన ప్రాంతాల్లో మహిళల కోసం తెచ్చిన ఫీడర్ అంబులెన్సులు నిలిపేశారన్నారు. గిరిజన గర్భిణీల వసతి గృహాలను నిర్వీర్యం చేసాడన్నారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు, పండుగ కానుకలు నాశనం చేశారన్నారు. దిశ పేరుతో డ్రామా తప్ప జగన్ పాలనలో ఆడ బిడ్డకు రక్షణగా నిలిచే రక్షణ వ్యవస్థ ఎక్కడ ఉండేదని వారు ప్రశ్నించారు. వైసీపీ హయాంలో నిర్వీర్యం చేసిన డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 2024-25 బడ్జెట్ లోనే సున్నా వడ్డీ పథకానికి రూ. 1,250 కోట్లు కేటాయించారన్నారు. అర్బన్ అమలుకు రూ.300 కోట్లు, రూరల్ ప్రాంతాల్లో అమలుకు రూ. 950 కోట్లు ప్రతిపాదించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్వాక్రాలోని ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఒక్కో సభ్యురాలికి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకూ వడ్డీ లేని రుణాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ వడ్డీ రాయితీ రుణాలను ప్రభుత్వం త్వరలో రూ. 10 లక్షలకు పెంచనుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేలా కూటమి ప్రభుత్వం పెట్టుబడి రాయితీని 35శాతం నుంచి 45శాతానికి పెంచిందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అంగన్వాడీలు, ఆశా వర్కర్లు ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న గ్రాట్యుటీ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. అంగన్వాడీల గ్రాట్యుటీ చెల్లింపుల కోసం బడ్జెట్ లో రూ.60 కోట్లు కేటాయించిందన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళలు సుమతి, మల్లీశ్వరి, రేణుక దేవి, అనిత, కుమారి, చంద్రమ్మ,అమరావతి, తులసి, ద్రాక్షాయణి, గజలక్ష్మి, సుమతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సీ.మల్లవరంలో.. ఘనంగా వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరుపతి రూరల్ మండలం సీ.మల్లవరం పంచాయితీలో చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, సీ.మల్లవరం పంచాయితీ సర్పంచ్ మొక్కల భారతి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆమె వైసీపీ జెండాను ఆవిష్కరించి,15కిలోల కేకును కట్ చేసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు,మహిళలకు, అభిమానులకు పంచి పెట్టారు.ఈ సందర్భ ంగా మొక్కల భారతి మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, ప్రజల ఆశీస్సులతో శక్తివంతమైన రాజకీయ పార్టీగా ఎదిగిన వైఎస్సార్సీ పీ పార్టీ 15వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని,ఈ సుదీర్ఘ కాలంలో పార్టీ నిరంతరం ప్రజలతోనే ఉందన్నారు.వైఎస్సార్ సీపీ ప్రజల కోసం పనిచేస్తూనే ఉందని అధికారంలో ఉన్న ఆ ఐదేళ్లలో దేశ రాజకీయ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఏ పార్టీ చేయని విధంగా సంక్షేమం,అభివృద్ధిని అందించిందని ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం,సుస్థిర ఆర్థిక వృద్ధిని సాధించడం, దేశంలోనే రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఆమె అన్నారు.

నేడు ఊంజల్ సేవ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రాత్రి 7.30గంటలకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఊంజల్ సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ ప్రాంగణం లోని ఊంజల్ సేవ మండపంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక సేవలు చేస్తారని... ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని బాపిరెడ్డి కోరుకున్నారు.

దువ్వాడ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోండి

- జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి డిస్పీకి బుధవారం జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొట్టే సాయి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పవన్ కళ్యాణ్ ని వ్యక్తిగతంగా దూషిస్తూ, 50 కోట్లు తీసుకుంటున్నాడు అని, అలాగే జనసేన కార్యకర్తలను సైకోలు అని మాట్లాడటం తగదు అని చెప్పారు. ఓడిపోయిన వైసీపీ నాయకులే ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ ని దూషించడం వల్లనే మేము ఓడిపోయాము అని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు అని, కానీ ఇంకా కొంత మంది నాయకులకు బుద్ధి రాలేదు అని, ఇకనైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే జనసైనికులు అందరూ తగిన శాస్తి చేయవలసి ఉంటుంది చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, గరికపాటి చంద్ర, చిరంజీవి, అరిగల వేణు, పగడాల ప్రతాప్, ఢిల్లీ బాబు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ముక్కంటీశ్వర స్వామి వారిని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అజయ్ సజ్జ బుధవారం దర్శించుకున్నారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం శ్రీకాళహస్తీశ్వరాలయంకు కుటుంబ సమేతంగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అజయ్ సజ్జకు తెలుగుదేశం పార్టీ మాజీ పట్టణ యువత అధ్యక్షులు సుజిత్ కుమార్ రెడ్డి, కోబాకు లక్ష్మణ్, చరణ్, చందు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం వెలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం విక్రమ్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మాజీ సైనికుడు పులి శ్రీకాంత్ పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈ. మునురేఖ, ఉపాధ్యాయులు చంద్రయ్య, సరిత, జనార్ధన్, సుధా బాయ్, ప్రసాద్, జై భీమ్ ఆర్మీ నాయకులు నక్క మల్లికార్జున్, నక్క పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - కార్వేటినగరం: రాబోయే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. బుధవారం పాఠశాల వారికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు విద్యాభ్యాసంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. అనంతరం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సోమసుందరం పిళ్లై, సుధాకర్, బీమయ్యలు మాట్లాడుతూ నాడు కష్టపడి చదువుకున్నందుకు నేడు మేము ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్నామని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ తో కూడిన విద్య ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. వార్షికోత్సవం క్రీడల్లో ప్రతిభకన బరిచిన విద్యార్థులకు దాతలు సోమసుందరంపిళ్లై, శైలేంద్ర సహాయంతో విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం విశ్రాంతి ఉద్యోగి సుధాకర్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ విజయ్లు తమ తల్లిదండ్రుల పేరుపై ప్రతి ఏడాది విద్యార్థులకు రూ. 5వే. రూ. 3333 అందిస్తామని తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా సరస్వతి పూజ ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ తాగ్యరాజు. పిడి తిరుమలరాజు, సరస్వతి,హరిత, మాలతి,సుమతి, సుబ్రమణ్యంరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణయ్య, ఢిల్లీ బాబు, చినయ్య చెట్టి, రాములు, రంజిత్ కుమార్, సిఆర్పి కార్తీక్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పుత్తూరు: మాదకద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనమని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో మాదకద్రవ్యాల నివారణ పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య మాట్లాడుతూ యువతరాన్ని చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైందని...తల్లిదండ్రులు విద్యార్థులు తగు జాగ్రత్తతో ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాలలో "ఈగల్ క్లబ్" లను ఏర్పాటు చేశామని అన్నారు. గంజాయి, డ్రగ్స్ మొదలైన మాదకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించే ఉద్దేశంతో 'ఈగల్ క్లబ్'అనే విభాగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని.అందులో భాగంగా కళాశాలలో కూడా ఈగల్ క్లబ్ ను ఏర్పాటు చేశామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జె. కోటేశ్వరరావు,వైస్ ప్రిన్సిపాల్ శ్రీ వి. వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కే. శ్రీనివాస్, న్యాయ నిపుణులు మురగారెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ఫోన్ పే మోసాలపై అప్రమత్తంగా ఉండండి

- మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: పట్టణంలోని దుకాణదారులకు షాపులకు మరియు ప్రజలకు ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, షాపు రూము రెంట్లు కట్టవలసినదిగా పురపాలక సంఘం వారు తెలియజేసిన దానిని అదునుగా తీసుకుని 7989272438, 8434827329 నెంబర్ల నుండి మరియు వేరే వేరే ఫోన్ నెంబర్ల నుంచి కమీషనర్, సూళ్లూరుపేట పురపాలక సంఘము వారి పేరు చెప్తూ మీరు పురపాలక సంఘమునకు చెల్లించవలసిన పన్నులకు సంబంధించి డబ్బులు ఫోన్ పే చేయండి అని చాలామంది దగ్గర డబ్బులు వసూలు చేయుటకు ప్రయత్నించుచున్నట్లు గుర్తించడమైనది. అని సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ మిమ్మలను కోరునది ఏమనగా ప్రజలకు ఎట్టి పరిస్థితులలోనూ పురపాలక సంఘమునకు కట్టవలసిన పన్నులు తెలియని వారి ఫోన్ నెంబర్లకు పంపవద్దని వారి నుండి వచ్చు ఎటువంటి లింకులు పైన క్లిక్ చేయవద్దని ప్రజలకు తెలియజేయవలసినదిగా కోరడమైనది. అదేవిధంగా పురపాలక సంఘమునకు చెల్లించాల్సిన పన్నులు స్వయంగా పురపాలక సంఘము నందలి క్యాష్ కౌంటర్ నందు కానీ పురపాలక సంఘము నందు పనిచేయుచున్న మీకు తెలిసిన సిబ్బంది వారికి కానీ, వార్డు సచివాలయము నందు లేదా ప్రభుత్వము వారి వెబ్సైట్ నందుగాని మాత్రమే చెల్లించవలసిందిగా కోరడమైనది.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసిన పవన్

విశాలాంధ్ర - వి కోట: మండల పరిధిలోని కరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17 నుంచి పరీక్షలు రాయనున్న సుమారు 144 విద్యార్థులకు స్థానిక సామాజిక సేవకుడు డా, ఎండిహెచ్‌పవన్ కళ్యాణ్ ప్యాడ్‌లు పెన్నులు తదితర పరీక్షా సామాగ్రి అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన 10వ తరగతి వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో పాఠశాల విద్య చాలా ముఖ్యమైనదని సమాజంలో సగర్వంగా తల ఎత్తుకొని గౌరవప్రదమైన స్థానాన్ని ఇచ్చే శక్తి ఒక విద్యకు మాత్రమే ఉందని అలాంటి విద్య పట్ల ఏ ఒక్క విద్యార్థి నిర్లక్ష్యం చేయరాదని తెలియజేశారు. పదవ తరగతి విద్యార్థులు రాబోవు పబ్లిక్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత తీసుకురావాలని సూచించారు. ఇదే కార్యక్రమంలో భాగంగా విద్యా సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు పలు క్రీడా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాదాపు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సురేంద్ర రావు, పాఠశాల కమిటీ చైర్మన్ జై చంద్ర,పాఠశాల ఉపాధ్యాయుల బృందం,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైయస్సార్ పార్టీ 15వ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర - పూతలపట్టు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ దినోత్సవం పురస్కరించుకొని ఐరాల మండలం వైయస్ గేట్ నందు పార్టీ జెండా ఎగురవేశారు. పార్టీ కార్యకర్తలకు. నాయకులకు అభిమానులకు పార్టీ అవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు విజయ రెడ్డి,జీవ రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ ప్రతాపరెడ్డి, ఉమా ఉమాపతి రెడ్డి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థులకు వీడ్కోలు

విశాలాంధ్ర - పాకాల: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రఫీ అధ్యక్షతన పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. పదవ తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించదని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ముని ప్రభాకర్, అభివృద్ధి కమిటీ సభ్యులు, లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలు తొలగించండి

- డీఎస్పీ నరసింహమూర్తి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని శ్రీకాళహస్తి డీయస్పీ నరసింహమూర్తి ఆదేశించారు. శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన వీధుల్లో బుధవారం తన సిబ్బందితో కలసి పర్యటించారు. ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే విధంగా ఉన్న దుకాణాలను ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణదారులతో మాట్లాడుతూ... రోడ్లను ఆక్రమిస్తూ దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఈ కారణంగా వాహనదారులతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి దుకాణదారులు సహకరించాలని డీయస్పీ నరసింహమూర్తి కోరారు. లేదంటే రోడ్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెండవ పట్టణ సీఐ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు బుధవారం వైభంగా జరిగాయి. ప్రతి పంచాయతీలో వైసీపీ శ్రేణులు పార్టీ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జగనన్న నాయకత్వంలో పటిష్టంగా పనిచేయడానికి సిద్ధంగా వున్నామని కూటమి పార్టీలకు తెలిసేలా చేశారు. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముందుగా రామచంద్రాపురం మండలం పీవీపురం గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో కలసి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిపారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి గ్రామస్తులతో కలసి స్వీట్లు పంచారు. జగనన్న నాయకత్వంలో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు కష్టపడాలని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, ప్రజలకు చేస్తున్న నష్టాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికునిలా పనిచేయాలని విన్నవించారు. ఆ తరువాత చంద్రగిరి పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి స్థానికులు సాదర స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయం ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులతో కలసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ మైనారిటీ సెల్ అధ్యక్షులు కరమలవల్లీకి ఘన సన్మానం

విశాలాంధ్ర - తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సిఫార్సుల మేరకు చంద్రగిరి నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులుగా కరమల వల్లీ నియమించిన విషయం తెలిసిందే.బుధవారం కరమల వల్లీ ని తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయితీలో వైఎస్సార్ సీపీ శ్రేణులు దుశ్శాలవాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరమల వల్లీ మాట్లాడుతూ పార్టీ నాయకులు,కార్యకర్తలతో మమేకమై కార్యకర్తలా శ్రమిస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు కృషిచేస్తానన్నారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,మాజీ తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

సీ గొల్లపల్లిలో ఘనంగా వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సీ.గొల్లపల్లిలో బుధవారం వైఎస్ ఆర్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మొదట వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పంచి పెట్టారు.ఈ సందర్భంగా విడుదల మాధవ రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం స్థాపించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని తెలిపారు.పార్టీ స్థాపించి 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15 సంవత్సరాల అడుగుపెడుతున్న సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విడుదల రవి,మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం రెడ్డి,గోపాల్, గోవర్ధన్ రెడ్డి, నాగరాజు,తేజ, వినయ్ వంశీ, మునికృష్ణా రెడ్డి,వైఎస్సార్ సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

విశాలాంధ్ర - గుడిపాల: గుడిపాల మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 24-25 పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిటీ చైర్మన్ టిఆర్ ఢిల్లీ భాయ్, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు అటు తల్లిదండ్రులకు ఇటు ఉపాధ్యాయులకు గొప్ప పేరును సంపాదించి పెట్టాలన్నారు, అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కాతుంబి ఉపాధ్యా యులు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కోట: కోట పట్టణ పరిధిలోని క్రాస్ రోడ్డు వద్ద గల మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైకాపా మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నవరత్నాలు పథకాలు అమలుతో పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ అధికారంలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేమారెడ్డి సనీల్ రెడ్డి,సన్నారెడ్డి చెంచు రాఘవరెడ్డి,పాదర్తి రాధాకృష్ణారెడ్డి,చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి,నరమాల.రమణయ్య, నేదురుమల్లి హరిచంద్ర రెడ్డి, దేవారెడ్డి నాగూర్ రెడ్డి,విజయ సారధి రెడ్డి,సుధా రెడ్డి,జగదీష్ పలువురు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైయస్సార్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం ఐరాల హెడ్ క్వార్టర్స్ నందు 15వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండా ఎగరవేయడం జరిగినది. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బుజ్జి రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు మండలమునందు పార్టీ 15వ ఆవిర్భావ జండా ఆవిష్కరించారు కార్యకర్తలకు నాయకులకు వివిధ భాగాల కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బుజ్జి రెడ్డి, వైస్ ఎంపీపీ నిత్య సురేష్ రెడ్డి పూతలపట్టు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు రామచంద్ర ప్రచార విభాగ అధ్యక్షులు ఆవుల రమణ పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి మండల కో ఆప్షన్ నెంబర్ అరుణ బై వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు దొరబాబు లోకనాథ్ రెడ్డి వాసుదేవ రెడ్డి నవాబ్ భాషా మల్లికార్జున రాజేష్ ప్రకాష్ మధు, నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

భోజన ప్రియులకు తిరుపతిలో సుందరం టిఫిన్ హౌస్ ప్రారంభం

- సహజ సిద్ధమైన రుచికరమైన వంటకాలు
- సౌత్ ఇండియన్ వంటకాలను అందించాలన్నదే తమ లక్ష్యం
- తిరుపతిలో మూడు 3స్టార్ హెూటళ్లలో సుందరం టిఫిన్ హౌస్ లభ్యం

విశాలాంధ్ర - తిరుపతి: రుచికరమైన సాంప్రదాయకమైన రుచికరమైన వంటలకు ప్రామాణికంగా నిలచిన సుందరం టిఫిన్స్ ఇప్పుడు ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి లో ప్రారంభించబడినది. దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు చెందిన రుచికరమైన ఆహారపు వంటలను అందించాలన్నదే సుందరం టిఫిన్ హౌస్ యొక్క లక్ష్యం. ఈ నేపథ్యంలో బుధవారం రామానుజ సర్కిల్ లో తిరుచానూరు రోడ్డులోని హెచ్.పీ పెట్రోల్ బంకు పక్కన ఆర్చిడియా గ్రూప్ ఆఫ్ హెూటల్స్ లో లాంఛనంగా ప్రారంభించారు. మొదట హార్కిడ్ హెూటల్స్ గ్రూప్ ఆఫ్ మేనేజింగ్పియస్. జయచంద్ర రాజు, పి. అనిత రాజు దంపతుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి సుందరం టిఫిన్ హౌస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో బెంగళూరు బనశంకరి లో క్యాటరింగ్ రంగంలో మొట్టమొదట అడుగుపెట్టి భోజన ప్రియులకు ఇంటిల్లిపాది రుచికరమైన నాణ్యమైన అల్పాహార వంటకాలను అందించి దక్షిణాది రాష్ట్రాల భోజన ప్రియుల మన్ననలను అందుకుంది. తమ అరుచర్లను దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ కర్ణాటక తమిళనాడు కేరళ ప్రాంతాల ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో సుందరం టిఫిన్ హౌస్ ను తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కర్ణాటక తమిళనాడు కేరళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యొక్క పాక సాంప్రదాయాలకు అనుగుణంగా న్యాచురల్ గా హెూమ్లీ ఫుడ్ ను ప్రజలకు అందించాలన్నదే తమ లక్ష్యం అని పేర్కొన్నారు. తరతరాల జ్ఞానం సహజసిద్ధమైన పదార్థాలు, రుచికరమైన వంటకాలు ప్రేమతో తయారు చేయబడ్డాయన్నారు. తిరుపతిలో 3 స్టార్ హెూటల్స్ లలో ప్రారంభం: తిరుపతి నగరంలో ఆర్చిడియా గ్రూప్ ఆఫ్ హెూటల్స్ మూడు 3 స్టార్ హెూటల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. దేశ నలుమూలలల నుండి వచ్చే భక్తులకు అందుబాటులో సరసమైన ధరలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా విశాలమైన గదులతో ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పుడు తిరుపతిలోని తమ గ్రూపుకు చెందిన మూడు స్టార్ హెూటలలో సుందరం టిఫిన్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆర్గానిక్, ట్రెడిషనల్, హెల్తీ ఫుడ్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. పాండిచ్చేరి, బెంగుళూరులలో సుందరం టిఫిన్ శాఖలు ఎక్కువగా విస్తరించి ఉన్నాయని, ఎక్కువమంది ప్రజలు హెూమ్లీ ఫుడ్ ను అనుభవించగలరని స గౌరవంగా తెలిపారు. ఇంటిలో అమ్మమ్మ, నాన్నమ్మ, నాని ప్రేమతో తయారు చేసిన హెూమ్లీ ట్రెడిషనల్ వంటకాలు సుందరం టిఫిన్స్ హౌస్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. మైసూర్ కాఫీ తమ ప్రత్యేకత: సుందరం టిఫిన్ హౌస్ లో మైసూర్ కాఫీ రుచి మనసుకు ఎంతో ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని ఇచ్చే విధంగా కాఫీ ప్రియులకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని సుందరం టిఫిన్ హౌస్ అవుట్ లెట్ లను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ తిరుపతిలోని కేటి రోడ్డులో మరొక సుందరం టిఫిన్ హౌస్ అవుట్ లెట్ ను ప్రారంభించినట్టు చెప్పారు. ఈనెల 15 వరకు 50% డిస్కౌంట్: సుందరం టిఫిన్ హౌస్ లో వంటకాలు భోజనం ప్రియులకు ప్రజలకు 50% రాయితీతో ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కావున న్యాచురల్ హెూమ్లి వంటకాలను ఆస్వాదించాలనుకునే వారందరికీ ఒకసారి సుందరం టిఫిన్ హౌస్ సందర్శించి ఇక్కడ అందించే ప్రేమానురాగాలతో సంతోషాలతో తమ వంటకాలను రుచి చూడాలని వారు కోరారు. కావున తిరుపతి నగర ప్రజలతో పాటు భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్కిడ్ గ్రూప్ ఆఫ్ హెూటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యం

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

విశాలాంధ్ర - కార్వేటినగరం: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజల హృదయాలలో నిలిచిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆసయ సాధనే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ ఆవిర్భవించిందని, ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి నాయకత్వంలో పేదరిక నిర్మూలనకు పని చేసిందని జీడీ నెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. బుధవారం 15వ పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంశ్య విగ్రహానికి మండల కన్వీనర్ శేఖర్రాజు స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్ పట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సమన్వయ కర్త మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రజాప్రస్థానం పాదయాత్రలో తాను ఇచ్చిన హామీల మేరకు ఆయిదేళ్లపాలనలో సంక్షేమ పథకాలను అందించి ప్రతి పేదవాడిని ఆర్థికంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఎక్కడ ఎటువంటి దళారులు లేకుండా పారదర్శక పాలన అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఆపద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారాన్నారు. మహిళలకు ఉచిత బస్సు తుస్సుమంటోందని, వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతన్నలు కాడిపట్టలేక పోతున్నారని, యువతకు నిరుద్యోగ బృతి అన్న సీఎం చంద్రబాబు బూటకపు సర్వేల పెరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. జగనన్న పాలనకు, చంరదబాబు పాలనకు ఉన్న తేడాను ఇప్పటికే గుర్తించారని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు గుణపాఠం చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్యలతో కలసి కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు.పట్నం ప్రభాకర్రెడ్డి. ఉప సర్పంచ్ శేషాద్రి, వెంకటేష్, సుందర్రాజ్, మునికృష్ణ, నందగోపాల్, ప్రభాకర్రెడ్డి, రాజ, శోభన్బాబు, పవన్, మురగయ్య. వెంకటస్వామి, పయణిరెడ్డి.మోహనమ్మ, అంభిక, తౌఖీషాఖాన్, రఫీ.ఆశీర్వాదం. ధనశేఖర్.శివప్రకాష్, శేఖర్, గోపినాధ్ పలువురు పాల్గొన్నారు.

చియ్యవరంలో జ్వరాలపై ముందస్తు సర్వే

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు చియ్యవరం గ్రామంలో బుధవారం ముందస్తు ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే చేయడంతో పాటు రెండు రోజులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి జ్వర పీడితులను గుర్తించే ప్రయత్నం చేశారు. ఈ నెల 10వ తేదీన చియ్యవరం గ్రామానికి చెందిన కనుపూరమ్మ, ప్రసాద్ లు జ్వరంతో బాధపడుతూ కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఇటీవల చియ్యవరంలో విష జ్వరాలు విజృంభించిన నేపథ్యంలో అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా వైద్యాధికారులు శివకుమార్ రెడ్డి, మాధవుడు ముందస్తుగా ఫీవర్ సర్వే, శిబిరాలు నిర్వహించి.. మెరుగైన వైద్యం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. రోగాలు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శి అంకయ్య ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు.

మహిళా లబ్దిదారులకు కుట్టు మిషన్ శిక్షణ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - పెద్దపంజాణి: మండలంలోని బిసి, కాపు కాపు, తెలగ, బలిజ, ఒంటరి ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులముల వారికి 2024-25 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బి.సి. కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పోరేషన్లకు సంబంధించిన మహిళా లబ్దిదారులకు బిసి కార్పోరేషన్, వారి ద్వారా కుట్టు మిషన్ శిక్షణ కొరకు దరఖాస్తుదారులు ఏపీ-ఓబి ఎంఎంఎస్ ద్వారా వారి పేరును ఆన్లైన్ లో నమోదు చేసుకొనుటకు తేదీ 07.03.2025 నుండి అవకాశం కల్పించబడి పడినట్లు ఎంపీడీ వో బాలాజీ తెలిపారు ఎంపిక కాబడిన లబ్దిదారులకు శిక్షణ అనంతరం 75% పైగా హా జరు కలిగిన వారికి సర్టిఫికెట్, ఉచితముగా కుట్టు మిషన్ అందజేయబడును అని ఆయన తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది వైఎస్ జగనే

శ్రీకాళహస్తి నియోజకవర్గం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కోబాకు లక్ష్మణ్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థి యువత భవి ష్యత్తును అంధకారంలోకి నెత్తింది వైఎస్ జగనే అని శ్రీకాళహస్తి నియో జకవర్గం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కోబాకు లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్ రూ.2,832 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు, పీజీ ఫీజు రీయిం బర్స్మెంట్ రూ.450 కోట్లు బకాయిల పెట్టి, బెంగళూరు ప్యాలస్ లో కూర్చొని నీచరాజకీయాలు నడుపుతున్న వైసీపీ నాయకుడు జగన్ రెడ్డి కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 9 నెలల వ్యవధిలోనే 6.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆంధ్ర రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని తెలి పారు. ఈ యొక్క పెట్టుబడుల వల్ల దాదాపు నాలుగు లక్షల నిరుద్యోగ యువత భవిష్యత్తు మారబోతుంది గతంలో మీరు పరిపాలించే సమయంలో మీరు తెచ్చింది ఏంటి యూట్యూబర్లు అని పిలిచి ఎం ఓ యూ లు చేసుకోవడమా... అదేవిధంగా దావోస్ సదస్సుకి మీరు ఎందుకు వెళ్ళలేదు అంటే బాధ్యత లేకుండా కోడిగుడ్డు కథ చెప్పటమా మీరు చేసిన అభివృద్ధి. విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసింది నువ్వు కాదా జగన్ నీ తండ్రి వైఎస్సార్ తీసుకొచ్చిన ఫీజు రీఎంబర్సుమెంటు పథకాన్ని రద్దు చేసింది నువ్వు విద్యార్థుల స్కాలర్ షిప్ ను రద్దు చేసి విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో విద్యార్థులను మోసం చేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా యువత గంజా యి మత్తుకు బానిసలు అవుతుంటే కనీసం వాటిని సప్లై చేసే వాళ్ల మీ ద చర్యలు తీసుకోకుండా వారికి విచ్చలవిడిగా స్వేచ్ఛను ఇచ్చి ఎంతో మంది యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసింది నువ్వు నువ్వా యువత భవిష్యత్తు గురించి మాట్లాడేది. నీ యొక్క రాజకీయ స్వార్థం కోసం నాడు ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు గారు ఒక మహా సంకల్పంతో ప్రవేశపెట్టినటువంటి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో అవినీతి జరిగిందని అబద్ధపు ప్రచారం చేసి స్కిల్ డెవలప్మెంట్ స్కీమ్ ని పూర్తిగా నిర్వీర్యం చేసింది నువ్వు కదా.. నీవు తీసుకున్న దుర్మార్గపు నిర్ణయాల వల్ల నీ ఆలోచన విధానాల వల్ల ఎం తో మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు... ఎన్ సి ఆర్ బి నివేదిక ప్రకారం 2,100 విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని బలవంతపు మరణాలకి పాల్పడడం జరిగింది.. దీనికి నువ్వేం సమాధానం చెబుతా వు జగన్ రెడ్డి దాదాపు ఆరు లక్షల మంది నిరుద్యోగ యువత కు ఆనాటి ప్రభుత్వం నిరుద్యోగ భృతి తో వారికి ఆర్థిక సహాయం చేస్తుం టే నిర్దాక్షణంగా ఆ యొక్క నిధులను దారి మళ్లించి ఆ యొక్క పథకా న్ని రద్దు వేశావు ఇది నీకు న్యాయమేనా. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యో గాలు ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాను అని అదేవిధంగా మెగా డీఎస్సీతో దగా చేసిన నువ్వు నిరుద్యోగ యువకు లకు మాట ఇచ్చి మడమతిప్పిన నువ్వు ఈరోజు మాట్లాడటం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యార్థుల పరీక్షల సమయంలో పోరుబా టల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడతావా వైసీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే బకాయిలు ఎందుకు పెట్టావ్ అని జగ న్ను అడగండి పోరుబాట కార్యక్రమం తాడేపల్లిలోని ప్యాలస్ ముందు చేయండిజీవో నెంబర్ 77 తీసుకొచ్చింది నువ్వు కాదాజగన్, ఇప్పుడు అదే జీవోను రద్దు చేయాలనడం దారుణం కాదా విద్యార్థుల భవిష్యత్తు పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు.

యువత పోరు విజయవంతం

విశాలాంధ్ర - పుత్తూరు: నారాయణ వనం మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్ సీపీ అధ్యక్షులు వైయస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సత్యవేడు నియోజక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా క్రియా శీల కార్యదర్శి టి. రాకేష్ కిరణ్ విన్నపం మేరకు. వైసీపీ నాయకులు బుధవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద కేంద్రంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, నాయకులు తరలిరావాలని కోరుతూ యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సత్యవేడు నియోజకవర్గం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టి రాకేష్ కిరణ్ నారాయణ వనం జిల్లా మరియు నాయకులతో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల మరియు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, వైస్ చైర్మన్లు, జిల్లా పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి జిల్లా పార్టీ సభ్యులు, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పార్టీ అనుబంధ విభాగం సభ్యులు,ఈ కార్యక్రమంలో అన్నా దొరై పెద్దబ్బ హెమచంద్ర రెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి డాక్టర్ ప్రసాద్ సుబ్రహ్మణ్యంయాదవ్ సాయి రవి శంకర్ పిజి బాబు వర్మ మహేష్ ఎంపీటీసీలు కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పలమనేరు: పలమనేరు నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ ఆవిష్కరించడం జరిగింది. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నాయకులతో కలిసి నివాళి అర్పించి తదుపరి పార్టీ శ్రేణులతో కలిసి కేట్ కట్ చేసి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరికీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వెంకటేగౌడ మాట్లాడుతూ 15ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంట నడిచిన పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేసారు.రాష్ట్రంలో అన్ని వర్గాలు సంతోషంగా ఉండాలన్నదే వైఎస్ఆర్సీపీ లక్ష్యమని అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పరితపించే నాయకుడు వైఎస్ జగన్మోహన్రెడ్డిని తెలిపారు. ప్రజల కష్టాల నుంచి వైయస్ఆర్సీపీ పుట్టింది. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పోరాడుతోందని, ప్రతిపక్షంలో కూర్చోవడం మనకు కొత్త కాదని అధికారంలో ఉన్నవాళ్లకు ఎప్పటికప్పుడు ధీటైన సమాధానమే ఇస్తున్నామని, ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటామని.. 3-4 ఏళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమేనని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గృహ నిర్మాణాలకు ఊతం

ఎస్సీలు, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు 75వేలు అదనం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా, జిల్లాలో 2029 నాటికి "అందరికీ గృహనిర్మాణం" అనే లక్ష్యాన్ని సాధించేందుకు, అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. ప్రభుత్వం జీఓఆర్టీ నెంబర్ 9 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-1 (పీఎంఏవై-1) పథకం క్రింద ఇప్పటికే మంజూరు చేయబడిన ఇళ్లకు 1.80 లక్షల రూపాయలకు అదనంగా పెండింగ్ నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి లబ్ధిదారులకు ఈ ఆర్థిక సహాయం చేయడం ద్వారా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 75వేలు లబ్ధిదారులకు అదనంగా ఇంటి నిర్మాణం కోసం అందించనున్నదని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం 2024 డిసెంబర్ 10, నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు మాత్రమే వర్తిస్తుంది. లబ్ధిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత బిల్లులను వెంటనే సమర్పించాలని ఆయన సూచించారు. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు ఈ విషయాన్ని తెలియజేసి విస్తృత ప్రచారం చేయాలని మే నెలాఖరు నాటికి 17,455 గృహాలు పూర్తి చేయాలని, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ఏప్రిల్ 2025లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికే ఈ అదనపు ఆర్థిక లబ్ధి వర్తిస్తుంది. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ ఎమెనిటీస్ సెక్రటరీలు అర్హత కలిగిన ప్రతి ఇంటిని తనిఖీ చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి యొక్క ఫోటోను క్యాప్చర్ చేస్తారు. "లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు ఎమెనిటీస్ సహాయకులు, ఎంపిడివోలు, మున్సిపల్ కమీషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయం చేసుకోవాలి" అని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

లడ్డూ తయారీలో నెయ్యి ఇబ్బందులు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: తిరుమలలో లడ్డు ప్రసాదం తయారీలో నెయ్యి సకాలంలో అందటం లేదు శ్రీవారి లడ్డు ప్రసాదం కోసం వినియోగం కోసం నెయ్యి వినియోగం టీటీడీకి కొంత ఇబ్బందిగా మారుతుంది తిరుమలలో వినియోగించే నెయ్యి నాణ్యతను పరిశీలించిన తర్వాతనే వినియోగానికి అనుమతిస్తున్నారు అయితే ల్యాబ్ లో ఏర్పాటు చేసిన నూతన పరికరాలతో పరీక్షకు ఎక్కువ సమయం పడుతుండటంతో ప్రసాదాలు తయారీకి సకాలంలో నెయ్యి అందించలేక పోతున్నట్లు తెలుస్తుంది దీనిపై టిటిడి అధికారులు స్పష్టత ఇచ్చారు తిరుమలలో నెయ్యి వినియోగం నాణ్యత పరీక్షల విషయంలో కొన్ని ఇబ్బందులు టీటీడీ ఎదుర్కోవాల్సి వస్తుంది తిరుమలలో ఏర్పాటుచేసిన ల్యాబ్ లో నూతన పరికరాలతో నెయ్యి పరీక్షలు జరుగుతున్నాయి శ్రీవారి అన్న ప్రసాదాలతో పాటు లడ్డు ప్రసాదాల తయారీ కోసం టీటీడీ ప్రతిరోజు 12 వేల నుంచి 14 వేల కేజీల నెయ్యిని వినియోగించాల్సి ఉంటుంది గతంలో తిరుమలలోని ల్యాబ్ లో నెయ్యి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు సరియైన పరికరాలు లేకపోవడంతో కల్తీ జరిగిందనే ప్రచారం పెద్ద ఎత్తున కలకలం రేపింది దీంతో తామే నెయ్యి నాణ్యతను వంద శాతం పరీక్షించే పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని టీటీడీ నిర్ణయించింది ఈ నిర్ణయానికి అనుగుణంగా దాదాపు రూ. 70 లక్షల విలువైన గ్యాస్ క్రోమటో గ్రాఫ్ జి.ఎస్ హై పర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమటో గ్రాఫ్ హెచ్ పి ఎల్ సి అనే రెండు పరికరాలను నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ విరాళంగా అందించింది వీటిని ఇటీవల తిరుమలలోని ల్యాబ్ లో ఏర్పాటు చేసి పరీక్షలు చేయడం మొదలుపెట్టారు అయితే టెండర్ సరఫరాదారుల నుంచి నెయ్యి సకాలంలో తిరుమలకు చేరుతున్నప్పటికీ పరీక్షించే సమయం అధికంగా పడుతున్న క్రమంలో ప్రసాదాల తయారీకి సకాలంలో నెయ్యి చేరడం లేదని తెలుస్తుంది నూతన పరికరాలు కావడంతో సూక్ష్మ స్థాయిలో పరీక్షించేందుకు అధిక సమయం పడుతున్నట్లు చెబుతున్నారు నాలుగు రోజుల క్రితం ఈ సమస్య ఏర్పడిందని ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదని టిటిడి అధికారులు స్పష్టం చేస్తున్నారు ప్రస్తుతం టీటీడీ వద్ద దాదాపు 23 వేల కేజీల నెయ్యి సిద్ధంగా ఉందని టిటిడి అధికారులు స్పష్టం చేశారు ఎప్పటిలానే రోజుకు 3. 5 లక్షల లడ్డూలను అన్న ప్రసాదాలను దిట్టం ప్రకారం తయారు చేస్తున్నామని వివరించారు.

శ్రీవారి కల్యాణ ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలి

టీటీడీ అధికారులు, జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో టీటీడీ ఈవో జే. శ్యామలరావు ఆదేశం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : ఈ నెల 15 వ తేదీన వెంకటపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణం లో జరుగనున్న శ్రీనివాస కల్యాణానికి సంబంధించిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం టీటీడీ అధికారులు, గుంటూరు జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలసి ఆయన సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణంపై వెంకటపాలెం సమీపంలోని గ్రామాల్లో టీటీడీ ప్రచారం రథం ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాలలో అవసరమైన గ్యాలరీలు, క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయం, కల్యాణ వేదిక పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు చేపట్టాలన్నారు. అదేవిధంగా శ్రీవారి ఆలయానికి విచ్చేసి భక్తులు సులభతరంగా స్వామివారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేలా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా సూచనలు చేయాలని కోరారు. కల్యాణానికి భజన బృందాలు , శ్రీవారి సేవకులను పెద్ద ఎత్తున ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా, టీటీడీ అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు సులువుగా వచ్చేందుకు వీలుగా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామివారి కళ్యాణాన్ని నేరుగా చూడలేని లక్షలాది మంది భక్తుల సౌలభ్యం కొరకు శ్రీనివాస కల్యాణాన్ని ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. వేదిక పరిసరాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు , మందులు, సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సాయంత్రం 4 గంటలనుండి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా హెచ్ డీపీపీ కార్యదర్శిని ఆదేశించారు.అనంతరం ఆయన అధికారులతో కలసి కల్యాణ వేదిక, తదితర పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను కూటమి ప్రభుత్వం దగా చేసింది

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరులో వైసీపీ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర -చిత్తూరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశం మేరకు బుధవారం చిత్తూరు నగరంలో వైసీపీ శ్రేణులు ఫీజు రియంబర్స్ మెంటుపై యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అమూల్ డే యిరి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతున్నట్లు ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 మాసాలకు పూర్తయిన విద్యా దీవెన వసతి దీనితోపాటు ఫీజు రియంబర్స్ మెంట్ ను చెల్లించలేదన్నారు. నిరుద్యోగ భృతి అసలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఫీజు లు చెల్లించలేని నిరుపేద విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు విద్యార్థులను మోసం చేశారని ఆరోపించారు. గతంలో వైయస్ జగన్ రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొస్తే, ప్రస్తుతం ఈ కాలేజీలను చంద్రబాబు నాయుడు ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారన్నారు. ఇంత దారుణమైన పాలన ఎప్పుడో చూడలేదన్నారు. సూపర్ సెక్స్ పథకాలను గాలికి వదిలేసారని చెప్పారు. రాజధాని నిర్మాణం చేస్తానంటే కాదు ప్రజలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చాలన్నారు. గతంలో ఉన్న మద్యం బ్రాండ్ లనే అమ్మకాలు చేస్తూ మద్యం రేట్లు పెంచి మరీ దోచుకుంటున్నట్లు ఆరోపించారు. ఈ ప్రభుత్వ పనితీరుపై అప్పుడే ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత నెలకొందని వచ్చేది వైసిపి అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఫీజు పోరు నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తూ జైలు పాలు చేస్తున్నట్టు చెప్పారు. ఇంత దారుణమైన పాలన ఎప్పుడో చూడలేదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేష్ గౌడ్, సునీల్ కుమార్, లలితా థామస్ ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయ రెడ్డి తో పాటు పలువురు వైసీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

షార్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ శ్రీహరికోట నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా మార్చి 12వ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సంధర్భంగా డా. భారతి హరిశంకర్, వైస్ చాన్సలర్, అవినాష్ లింగం ఇన్స్టిట్యూట్ ఫర్ హోమ్ సైన్స్ హైఅర్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమన్, కోయంబత్తూర్‌ని ముఖ్య అథిధిగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సార్ డైరెక్టర్ రాజరాజన్ సభ అధ్యక్షతవహించగా, కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, డిడి గోపికృష్ణ, వివిద విభాగాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగస్తులు పాల్గొనడం జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రకాల పోటీ పరిక్షలు ఫన్ గేమ్స్, క్రికెట్, విజిటేబుల్ అండ్ ఫ్రూట్ కటింగ్, సెల్ఫ్ మెహందీ హ్యాండ్ (క్రాఫ్ట్,) నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. షార్ హాస్పిటల్ నందు రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించడం జరిగింది. ఇందులో దాదాపు 100 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

శ్రీసిటీని సందర్శించిన ఏపీఐఐసీ చైర్మన్

విశాలాంధ్ర- సత్యవేడు: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌళిక సదుపాయాలకల్పనా సంస్థ (ఏపీఐఐసీ) చైర్మన్ఎం. రామరాజుశ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ డైరెక్టర్ ముకుంద రెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. రామరాజు ఎంతో ఆసక్తితో శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకు న్నారు. సమావేశం అనంతరం శ్రీసిటీ పరిసరాలలో పర్యటించి పారిశ్రామిక కార్యకలా పాలను వీక్షించారు. పెప్సికో పరిశ్రమను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. రామ రాజు పర్యటనను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీఐఐసీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇది మొట్టమొదటి శ్రీసిటీ సందర్శన కాగా, ఆయన పరిశీలనలు, సూచనలు తమకెంతో విలువైనదంటూ తన సందేశంలో పేర్కొన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ తో పాటు ఏపీఐఐసి జోనల్ మేనేజర్ విజయ భరత్ రెడ్డి ఈ పర్యటనలో పాల్గొన్నారు.